# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 తేదిః 27-07-2015

## <u>హైదరాబాద్ వాటర్ సప్లై</u>

హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందివ్వడమే లక్ష్యంగా సరైన ప్రణాళికతో ముందుకు పోవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చెప్పారు. కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తరలించి మంచినీటిని అందించాలని, హైదరాబాద్ నగరంలో మంచినీటికి కొరత లేదనే మాట రావాలన్నారు. గృహాలతో పాటు పారిశ్రామిక, వాణిజ్య, వర్తక కేంద్రాలకు అవసరమైన మంచి నీరందించాలని సిఎం చెప్పారు. హైదరాబాద్ నగరం, నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాలు కలుపుకుని, కోటి 42 లక్షల జనాభా ఉంటుందని, వీరికి ఏడాదికి 42.58 టిఎంసిల నీరు అవసరమని, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. నగర శివారులోని చెరువులు, మంజీరా నుంచి త్వరలో అందే కృష్ణా, గోదావరి నీటిని కూడా కలుపుకుంటే 32 టిఎంసిలు అందుబాటులో వస్తాయన్నారు. లోటును భర్తీ చేసుకోవడానికి కృష్ణా, గోదావరి నుంచి మరిన్ని నీళ్లను తరలించాలని, దీని కోసం ప్రత్యేక రిజర్వాయర్లు నిర్మించాలన్నారు. నగరంలో దాదాపు 9 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయని, అన్ని ఇండ్లకు కలిపి హెచ్ఎండిఎ పరిధిలో ఇంకా ఎన్ని నల్లా కనెక్షన్లు కావాలో నిర్ధారించి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

హైదరాబాద్ మంచినీటి సరఫరా పై సోమవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఎంజీ.గోపాల్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, జిహెచ్ఎంసి కమిషనర్ సోమేష్ కుమార్, హెచ్ఎండబ్ల్యుఎస్ ఎండి. జగదీశ్వర్, చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, గోదావరి నుంచి హైదరాబాద్ కు నీరు తీసుకువచ్చే పైపు లైన్ల నిర్మాణం, పంపు హౌజ్ లు, ట్రీట్ మెంట్ ప్లాంట్ల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మార్గమధ్యలో రైల్వే క్రాసింగ్ ల వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నేషనల్ హైవే దగ్గర కూడా అనుమతులు త్వరగా రావడం లేదని చెప్పారు. దీనికి స్పందించిన సిఎం.... రైల్వే శాఖ, నేషనల్ హైవేస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. అనుమతులు త్వరగా ఇవ్వాలన్న సిఎం వినతికి వారు సానుకూలంగా స్పందించారు. వాటర్ గ్రిడ్ కోసం రైట్ ఆఫ్ వే చట్టం తెచ్చినట్లే గోదావరి, కృష్ణా నదుల నీళ్ల కోసం వేసే పైపు లైన్ కు రైట్ ఆఫ్ వే చట్టం తేవాలన్నారు. హైదరాబాద్ నగర ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని దీర్ఘ కాలిక ప్రణాళిక రూపొందించాలని, పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా హైదరాబాద్ కు మంచినీళ్లు తీసుకుంటామని సిఎం చెప్పారు. దీనికి అనుసరించాల్సిన వ్యూహం రూపొందించాలని చెప్పారు.

.............................................................................................................

సిపిఆర్ఓ టు సిఎం